


శనివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0°C | కనిష్ఠం : 23.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.34 గం..
సహర్ : సోమవారం ఉ : 4.48 గం..

సౌకర్యాల్లేక.. అంగన్‌వాడీలా



అద్దె భవనంలో కొనసాగుతున్న తొర్రూరు మండలం ఫత్తెపురం అంగన్‌వాడీ కేంద్రం



శిథిలావస్థకు చేరుకున్న నెల్లికుదురు మండలం రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రం

- కేంద్రాల్లో సమస్యల తిష్ట
- పలుచోట్ల అద్దెభవనాల్లో నిర్వహణ
- సకాలంలో బిల్లులు రాక అవస్థలు
- విధులతో పాటు ఇతర సేవలూ అందిస్తున్న టీచర్లు
- శ్రమకు తగిన వేతనం లేదని ఆవేదన
- జీతాలు పెంచాలని డిమాండ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 30 : సరైన సౌకర్యాలు లేక.. సమస్యల ఒడిలో చిక్కుకుని అంగన్‌వాడీ కేంద్రాలు డీలా పడుతున్నాయి. జిల్లాలోని పలు కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతుండగా, కొన్నిచోట్ల సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నారుల ఆలనాపాలన చూస్తూ.. వారి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ముఖ్యభూమిక పోషిస్తున్న అంగన్‌వాడీలు అష్టకష్టాలు పడుతున్నారు. తమ సొంతశాఖ విధులతో పాటు ఇతర పనులతో ఒత్తిడికి గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొన్నింటికి మాత్రమే సొంత బిల్డింగ్‌లు ఉండడం, మరికొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతుండడం అందులో మౌలిక వసతుల లేమితో ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు అద్దెలు, స్టేషనరీ, కూరగాయలు, గ్యాస్ బిల్లులు సకాలంలో రాక పోవడంతో అంగన్‌వాడీ టీచర్లపై ఆర్థిక భారం పడుతోంది. ఇవన్నీ ఒక్క ఎత్తైతే మరో కష్టం వచ్చి పడింది. ఏటా మార్చి నెలలో ఇంటింటా సర్వే పేరిట కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేస్తారు. ఈ ఏడాది సభ్యుల వివరాలను సేకరించి, ఓషియన్ ప్యాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ల్లో సెల్ ద్వారా నమోదు చేయాలంటే సతమతమవుతున్నారు. రిటైర్‌మెంట్ వయసులో ఉన్నవారు సెల్‌పై, యాప్‌లపై సమగ్ర అవగాహన లేక నమోదు చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఏజెన్సీ మండలాల్లోని పలు గ్రామాల్లో నెట్‌వర్క్ లేక కుటుంబసభ్యుల వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, వారికి సహాయకులుగా ఉండే ఆయా (హెల్పర్లు)లు సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెకు దిగారు. ఆ సమయంలో సమస్యల పరిష్కారానికి నాటి సర్కారు హామీ ఇవ్వడంతో కొద్ది రోజుల తర్వాత సమ్మెను విరమించి విధుల్లో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశతో ఎదురు చూస్తున్నారు.

మానుకోట జిల్లాలో ఇలా..

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంయుక్త నేతృత్వంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాలు, 461 గ్రామ పంచాయతీ పరిధిలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రతీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచరుతో పాటు ఆయాలు పని చేస్తున్నారు. జిల్లాలోని డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూరు ప్రాజెక్టుల పరిధిలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,100 మంది గర్భినులు, 5,663 మంది బాలింతలు, మూడు నెలలో చిన్నారులు 14,541, ప్రీస్కూల్ పిల్లలు 12,758 మంది ఉన్నారు. వారందరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందడంతో ప్రీస్కూల్ ద్వారా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు.



మానుకోటలో కుటుంబ సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల లేమి..

చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంతోపాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు కొట్టుమిట్టుడాడుతున్నాయి. జిల్లాలోని 461 గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న కేంద్రాల్లో మౌళిక వసతులు కరువయ్యాయి. సొంత భవనాలు లేక కొన్నింటిని ప్రాథమిక పాఠశాల ఆవరణలో, డోనర్స్ ఇచ్చిన భవనాలు (రెంట్ ఫ్రీ)గా కొనసాగుతుండగా, మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వాటికి కూడా ప్రతీనెల క్రమం తప్పకుండా అద్దెలు, గ్యాస్, కూరగాయల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క రోజురోజుకు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్న ఆ బిల్లులు మాత్రం పెంచడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం లేక అరకొర వసతుల నడుమ అంగన్‌వాడీ బడిని లాగుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి..

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు ఎన్నికల విధుల్లో బూత్ లెవల్ ఆఫీసరు (బీఎల్వో) పనులు, కొత్త ఓటర్లను చేర్పించడం లాంటి పనులు కూడా అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో కూడ వారు భాగస్వాములవుతున్నారు. ఇలా గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో వీరి భాగస్వామ్యం ఉంటుంది. పదవీ విరమణ అనేది లేకపోవడంతో 60 సంవత్సరాలు పైబడిన వారు విధులు నిర్వర్తించాలంటే ఆరోగ్యం సహకరించక ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ టీచర్లను చాలీచాలనీ వేతనాలతో నెలకు రూ.14,500తో పని చేస్తున్నామని తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో నూతనంగా కొలువు దీరిన ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి..



గుండు సులోచన, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు, మానుకోట

అంగన్‌వాడీ టీచర్లు చాలీచాలనీ వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నెలకు కనీస వేతనచట్టం ప్రకారం రూ.26 వేలు చెల్లించాలి. మృతి చెందిన సమయంలో అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు దహన సంస్కారాల కింద రూ.50 వేలు చెల్లించాలి. 60 సంవత్సరాలు పైబడిన ఆయాలు వంట చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించి, వారి వారసులకు ఉద్యోగం ఇవ్వాలి. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి తమను ఆదుకోవాలి.

‘భారతరత్న’ పీవీ...

- పురస్కారాన్ని బహూకరించిన కేంద్రం
- రాష్ట్రపతి ముర్ము నుంచి అందుకున్న కుమారుడు ప్రభాకర్‌రావు





వంగరలో పీవీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రాష్ట్రపతి చేతుల మీదుగా భారతరత్న అవార్డు అందుకుంటున్న పీవీ ప్రభాకర్‌రావు

భీమదేవరపల్లి, మార్చి30 : మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని బహూకరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం నలుగురికి భారతరత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అందజేయగా.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు గాను ఆయన కుమారుడు ప్రభాకర్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రభాకర్ రావుతో పాటు ఆయన సోదరి సురభి వాణిదేవి, మనువడు కష్యప్ కూడా వెళ్లారు. ఇక పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారాన్ని బహూకరించిన నేపథ్యంలో వంగరలోని పీవీ నివాసంలోని పీవీ విగ్రహానికి స్వామి రామానందతీర్థ సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ఎదులాపురం మొగిలి, కాంగ్రెస్ నాయకులు చిదురాల స్వరూప, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒల్లాల రమేష్, చెప్యాల చందారెడ్డి, శ్రీరా మోజు మొండయ్య, రాంబాబు, సమ్మయ్య, రామకృష్ణ, లావణ్య తదితరులు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగుతేజం పీవీ విలు వలతో కూడిన రాజకీయాలు చేశారని, మచ్చ లేని వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలే నేడు దేశాన్ని పటిష్ఠంగా నిలిపాయని గుర్తుచేశారు.

నేడు కేసీఆర్ పర్యటన



జనగామ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పులకు వస్తున్నారు. ఎండిపోయిన పంటల పరిశీలనలో భాగంగా ఆయన జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో ఎండిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి జనగామ మీదుగా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాకు 10.30 గంటలకు చేరుకుంటారు. సుమారు అరగంట పాటు పంటలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలానికి వెళ్తారు.

ముగిసిన ‘పది’ వార్షిక పరీక్షలు

- చివరి రోజు 8,182 మంది విద్యార్థులు హాజరు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 30 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 18న ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం జరిగిన సాంఘిక శాస్త్రం ఎగ్జామ్‌తో ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు పరీక్ష జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 49 సెంటర్లలో 8,198మందికి గాను 8,182 (99.80 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 48పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 8,194 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 8178 మంది పరీక్ష రాశారు. హాజరు కాగా 16 మంది విద్యార్థులుగైర్హాజరైనట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఐదు పరీక్ష కేంద్రాలను జిల్లా అబ్జర్వర్, జాయింట్ డైరెక్టర్ రాజీవ్ తనిఖీ చేశారని, 13 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు సందర్శించగా, గూడూరు మండలంలోని 3 సెంటర్లను సందర్శించాని డీఈవో తెలిపారు. ఒకే షనల్ పరీక్షలు జిల్లాలో 9 సెంటర్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1న పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు ఉంటుందని తెలిపారు.


అక్రమ వసూళ్లకు పాల్పడిన..

ఫ్లయింగ్‌స్క్వాడ్ బృంద సభ్యులపై కేసు

- రిమాండ్‌కు తరలింపు
- ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : జిల్లాలోని రెండ్యాలలో అక్రమ వసూళ్లకు పాల్పడిన ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం సభ్యులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తిరుపతిరావు శనివారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. లోకసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లాలో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 20, 21 మహబూబాబాద్ మండలం నడివాడ, గడ్డిగూడెం, సంద్రాలగూడెం గ్రామాల్లోని కిరాణాషాపుల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కిరాణ షాపుల్లో మద్యం అమ్ముతుండగా, ఎన్నికల కోడ్ ఉండగా, ఎందుకు అమ్ముతున్నారని వారిని బెదిరించారు. తర్వాత తమకు డబ్బులు ఇస్తే మీమీద కేసు లేకుండా చూస్తామని చెప్పి, రెడ్యాలలో మంచాల వేణుకు చెందిన షాపువద్ద ఫోన్‌పే ద్వారా వేణు నుంచి రూ.1500 తీసుకున్నారని, ఈ విషయం తెలుసుకున్న వేణు స్నేహితుడైన నల్లు దేవేందర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందంలోని జూనియర్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్ పలుషాపుల నుంచి నగదు తీసుకుంటూ, నగదు లేనిచోట బృందం సభ్యులైన ఫొటోగ్రాఫర్ కండె వేంకటేశ్వర్లు ఫోన్‌పేకు చేయించుకుంటున్నట్లు చెప్పారు. తర్వాత సద్దాం హుస్సేన్ ఫోన్‌పేకు తిరిగి చేయించుకుని వారు వసూలు చేసిన మొత్తం రూ.15,100ను టీమ్ లీడర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ స్వామాజీకు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈనెల 29న జూనియర్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ స్వామాజీ, వీడి యో గ్రాఫర్ కండె వేంకటేశ్వర్లును అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వీరితోపాటు టీమ్ సభ్యులైన హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, గోపిపై శాఖపరమైన చర్యలు తీసుకుని వారిని విధుల నుంచి తొలగించినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు.

బీఆర్ఎస్‌కు కోఆప్షన్ సభ్యుడి రాజీనామా



మీర్జామోసిన్‌బేగ్

చిన్నగూడూరు, మార్చి 30 : బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జామోసిన్ బేగ్ శనివారం రాజీనామా చేశారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మారుతున్న రాజకీయ పరిస్థితుల వల్ల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. తన రాజీనామాను జిల్లా అధ్యక్షురాలు, మండల అధ్యక్షులకు పంపినట్లు తెలిపారు. పార్టీలో కొనసాగినంత వరకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తన భవిష్యత్ కార్యాచరణను తెలుపుతానని ఆయన అన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మహబూబాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్స్ విధులు నిర్వహించే అర్హులైన ప్రతీ ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఇతర ఉన్నతాధి కారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్‌బ్యాలెట్ అందించాలని సూచించారు. వీరి కోసం ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద తప్పనిసరిగా ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజున జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది పేరు, ఉద్యోగికోడ్, హోదా, సెల్ నెంబర్, ఓటరు వివరాలు, అసెంబ్లీ సెగ్మెంట్ తదితర వివరాలు రూపొందించి, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఉద్యోగులందరికి పోస్టల్ బ్యాలెట్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ జిల్లాలో ఉద్యోగుల నుంచి ఫారం-12 తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకాధికారిని నియ మించాలని సూచించారు. ఏప్రిల్ 30 నుంచి మే 1వ తేదీ వరకు రిటర్నింగ్ అధికారి స్థాయిలో పోస్టల్ బ్యాలెట్‌లను ప్రింట్ చేయాలని అన్నారు. 85 సంవత్సరాలు పైబడిన నడవలేని సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు, కోవిడ్ పేషెంట్లకు ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందని, అందుకోసం ఏప్రిల్ 23లోపు ఫారం-12డీ సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్,అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింగరావు, జిల్లా అధికారులు సుధాకర్, వరలక్ష్మి, పవన్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.



మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

హరితహారం లక్ష్యాల సాధనకు కృషి చేయాలి..

హరితహారం లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో హరితహారం కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. 2024-25 వార్షిక సంవత్సరానికి సంబంధించి శాఖల వారీగా నాటాల్సిన మొక్కల లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. హరితహారం అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాల ఎంపిక కోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో అధికారులు తానేశ్వర్, సురేష్, మరియన్న, హరిప్రసాద్, శాంతకుమారి, అభిమాన్యుడు, కృష్ణమాచార్య, నీరజ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఊరూరా ఖాళీ చేయించాలి

- కాంగ్రెస్‌లో చేర్పించేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలి
- ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ, మార్చి 30 : బీఆర్ఎస్‌ను ఊరూరా ఖాళీ చేసేలా కాంగ్రెస్ కార్యకర్తలు చేరికలను పెంచాలని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పిలుపునిచ్చారు. అవసరమైతే ‘గులాబీ’ పార్టీ శ్రేణుల ఇంటికి వెళ్లి, వారితో మాట్లాడి.. హస్తం పార్టీలో చేరేలా కృషి చేయాలన్నారు. కష్టించి పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. శనివారం మరిపెడ బంగ్లాలో డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలతో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌తో కలిసి సమావేశమై, ఆయన మాట్లాడారు. ప్రతీ కాం గ్రెస్ కార్యకర్త తానే ఎంపీ అభ్యర్థినని గుర్తించి, బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అట్లాంటి వారిని కాంగ్రెస్ శ్రేణులు గుర్తించి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం మరిపెడ గాంధీ విగ్రహం దగ్గర కేంద్ర సంస్థలతో బీజేపీ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులకు గురిచేసే చేష్టలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి, గంధసిరి అంబరీశ, ఎస్కే. అఫ్జల్, తాజుద్దీన్, కాలం రవీందర్‌రెడ్డి, అప్సర్, గుగులోత్ రవి, ఐలిమల్లు, అల్వాల ఉపేందర్, శ్రీకాంత్, విజయ్‌నాయక్, అంబటి వీరభద్రం, బట్టునాయక్, రావుల రంగారెడ్డి, మారబోయిన వెంకటేశ్వర్లు, బీక్యానాయక్, కొత్త శేఖర్, జీవన్, విజయ్‌నాయక్, గండి వీరభద్రం పాల్గొన్నారు.



మరిపెడ గాంధీ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న రాంచంద్రునాయక్, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

ఉద్రిక్తంగా బయ్యారం సొసైటీ మహాజన సభ

- చైర్మన్, వైస్ చైర్మన్ పానెల్‌గా వాగ్వావాదం
- అవినీతి, అక్రమాలపై సభ్యుల నిలదీత
- సొసైటీ ట్రైనర్ జోక్యంతో సద్దుమణిగిన సమస్య



బయ్యారం సొసైటీలో గొడవపడుతున్న సభ్యులు

బయ్యారం, మార్చి 30 : ఆరు నెలలకోమారు జరిగే బయ్యారం పీఏసీఎస్ సొసైటీ మహాజన సభ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అభివృద్ధి, ఆదాయ వ్యయాలు, సమస్యలు, భవిష్యత్తు ప్రణాళిక తదితర అంశాలపై సభ్యులతో చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో వాగ్వాదం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్ సొసైటీ) కార్యాలయంలో శనివారం చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. సభ ప్రారంభం కాగానే చైర్మన్ గడిచిన ఆరునెలల్లో సొసైటీలో జరిగిన అభివృద్ధి, ఆదాయ వ్యయాలు తదితర వాటి గురించి వివరిస్తున్నారు. ఈ క్రమంలో వైస్‌చైర్మన్ గంగుల సత్యనారాయణ, డైరెక్టర్ కసనబోయిన శ్రీనివాస్ జోక్యం చేసుకొని ముందుగా సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాల సంగ తేంటని, దానికి సమాధానం చెప్పాలని నిలదీశారు. దీంతో చైర్మన్ ప్రతి స్పందిస్తూ సభ నడపటానికి ఓ ప్రొసీజర్ ఉంటుంది, ఎట్లపడితే అట్ల.. ఎప్పుడు పడితే అప్పుడు.. ఏది పడితే అది నీఇష్టం వచ్చినట్లో.. లేక నా ఇష్టమొచ్చినట్లో మాట్లాడటానికి కుదరదంటూ సమాధానమిచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే గ్రూపులుగా విడిపోయి స్టేజీ వద్దకు గుమ్మిగూడిన పలువురు సభ్యులు, రైతులు చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో ఘర్షణకు దిగారు. చైర్మన్, వైస్ చైర్మన్ పానెల్‌గా సభ్యులు, రైతులు గొడవకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. కొద్దిసేపటికి మహాజన సభకు అతిథిగా వచ్చిన సొసైటీ ట్రైనర్ పంత్యానాయక్ సభ్యులు, రైతులను సముదాయించటంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం చైర్మన్ సొసైటీకి సంబంధించిన ప్రగతి నివేదికను సభలో చదివి వినిపించారు. తాను ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. కొందరు సొసైటీనిఅభాసపాలు చేసేందుకు సోషల్ మీడియా వేదికగా అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ప్రతీ దానికి లెక్కలున్నాయని, ఎప్పటికప్పుడు ఆడిట్ జరుగుతూనే ఉందని సభకు వివరించారు. తదనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మరి కొంతమంది సభ్యులు సొసైటీ కేంద్రంగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాలని, సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించి డైరెక్టర్లకు వచ్చిన నోటీసులపై సమాధానమివ్వాలని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని పలువురు సభ్యులు అడిగిన వాటిలో కొన్నింటికి సమాధానం ఇచ్చారు. మహాజన సభలో డైరెక్టర్లతో పాటు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా లయన్స్ సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, మార్చి 30: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 80 లయన్స్ క్లబ్‌లకు చెందిన వేడుక లయన్స్ సమ్మేళనం ప్రస్తుత 320 - ఎఫ్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో ఆదివారం వైభవంగా జరుగనుంది. హనుమకొండ ములుగురోడ్‌లోని బీఆర్ఆర్ గార్డెన్స్ వేదికగా జరిగే వేడుకల్లో లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ జి.బాబురావు, మల్టిపుల్ నాయకులు పూర్వ గవర్నర్లతో సహా సుమారు 2వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే వేడుకల్లో భాగంగా సాయంత్రం ఎస్‌వీడీజీ ఎన్నిక జరుగనుంది. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ కాకతీయ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకల విజయవంతానికి ప్రత్యేకంగా వివిధ కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున లయన్స్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈసారి ప్రత్యేకంగా పలుస్పెషాలిటీక్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. హంగర్ రిలీఫ్ పేరిట తాను ఎన్నికైనప్పటి నుంచి ఈ రోజు వరకు నిరంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ముఖ్యంగా హనుమకొండ పట్టణ ప్రాంతంలోని నాలుగు క్లబ్‌లతో పాటు జనగామ, తొర్రూరు, స్టేషన్ ఘన్‌పూర్, చేర్యాల, మహబూబాబాద్ పట్టణాలలో లయన్స్ క్లబ్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో పాలకుర్తి, మొండ్రాయి, ములుగులాంటి పలు క్లబ్‌లు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు బ్యాంకు సేవలు యథాతథం

వరంగల్ చౌరస్తా, మార్చి 31: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం మార్చి 31 ఆదివారంతో ముగియనున్న వేళ దేశ వ్యాప్తంగా ఆదివారం అన్ని బ్యాంకులు లావాదేవీలు నిర్వహించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఆదివారం కూడా సేవలను అందించనున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే లావాదేవీలు, నగదు, చెల్లింపు ఆర్టీజీఎస్ నెఫ్ట్, చెక్కుల చెల్లింపు, క్లియరెన్స్ లాంటి సేవలు పనిచేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్ల కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే.! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌బీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

● ఆమోదించిన అకడమిక్ సెనెట్ సమావేశం ● విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి : వీసీ



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య తాడికొండ రమేష్

హనుమకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.431.20కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించింది. శనివారం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన విశ్వవిద్యాలయం సెనెట్‌హాల్‌లో జరిగిన 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య పి.అమరవేణి బడ్జెట్ ప్రవేశపెట్టారు. యేడాదిపాటు ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లు, ఉద్యోగ విరమణ భత్యాలు, ఇతర ఖర్చులకు రూ.449.73కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.134.94కోట్లు, ఇతర వనరుల నుంచి రూ.296.26కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. వీటిలో యూజీసీ నుంచి బకాయిల రూపంలో రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజు రూపంలో రూ.8కోట్లు, అంతర్గత వనరుల ద్వారా రూ.24.28కోట్లు, పరీక్షల విభాగం ద్వారా రూ.58.79కోట్లు రాగలవని అంచనా వేశారు. ఖర్చులను, రాబడులను ఆచార్య అమరవేణి ఎనిమిది అంశాల్లో చూపించారు. అదే సమయంలో రూ.8.08కోట్లు లోటు ఉంటుందని వెల్లడించారు. రుసా నిధులు రూ.44కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఉద్యోగుల జీతాలకు, పెన్షన్‌లకు రూ.207.44 కోట్లు, పరీక్షలు, అకడమిక్ కార్యక్రమాలకు రూ.63.44కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

అందరి కృషి

విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి ఉందని వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ తన నివేదికలో పేర్కొన్నారు. న్యాక్ ఏప్లస్ గ్రేడింగ్ సాధించడం ఒక గొప్ప అంశమని అన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత వనరులు, రాష్ట్ర ప్రభుత్వ, ఇతర సంస్థల సహకారంతో అకడమిక్, పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల సంక్షేమం, ఇత ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కెహబ్, పీవీ విజ్ఞాన కేంద్రం, పరిపాలన భవన్‌లో రెండోఅంతస్తు, డైనింగ్ హాల్, బాలికల వసతి గృహం విస్తరణ, దూర విద్య కేంద్రంలో మీడియా సెంటర్ పునరుద్ధరణ అభివృద్ధి పనుల్లో ఉన్నాయన్నారు.

ఒప్పందాలు

అకడమిక్‌పరంగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలతో, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు, జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షకు శిక్షణ చేపట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందటంలో ప్రోత్సాహం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై 40 రోజుల శిక్షణా కార్యక్రమంతో పాటు ఐదేళ్ల విరామం తర్వాత పీహెచ్‌డీ ప్రవేశాలు విజయంతంగా నిర్వహించినట్లు వీసీ వివరించారు. రాష్ట్రపతి, గవర్నర్ నుంచి అవార్డులు పొందినట్లు తెలిపారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించామని, అలాగే విభాగాలు, కళాశాలల్లో కూడా అంతర్జాతీయ, జాతీయ సదస్సులు నిర్వహించామన్నారు.

ఉద్యోగుల సంక్షేమం

విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నట్లు వీసీ ఆచార్య రమేష్ తెలిపారు. దినసరి వేతన ఉద్యోగుల జీతాలు పెంచినట్లు తెలిపారు. క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు కూడా త్వరలో పెరుగుతాయన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన భత్యాలు, రెగ్యులర్ ఉద్యోగుల పీఆర్‌సీ బెనిఫిట్స్ చెల్లించామన్నారు. గవర్నర్ ఆర్డర్ల ప్రకారం పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెమ్యునరేషన్‌లు పెంచామన్నారు. పరిమిత, నియమిత ఆర్థిక, మానవ వనరులతో సమష్టి కృషితో ముందుకు పోతున్నామన్నారు.

కోర్సులు

పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, ప్రభుత్వం నిధులు, నియామకాలకు ముందుకు రావాలని, దూర విద్యాకేంద్రంలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని అన్నారు. పూర్తిస్థాయి అకడమిక్ సెనెట్ ఉండాలన్నారు. మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య విద్యావతి మాట్లాడుతూ.. పలు విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత చాలా ఉందని అన్నారు. పరిశోధనలు నిరంతరం జరగాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావొద్దని, నిధులను సమీకరించాలని అన్నారు. అకడమిక్ సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని విచారం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ పెరగడం లేదని అన్నారు. యూనివర్సిటీలు బాగుపడాలంటే నియామకాలు జరగాలని అభిప్రాయపడ్డారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడం అభినందనీయం అన్నారు. మరో అకడమిక్ సెనెట్ సభ్యుడు మాణిక్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీ పాలనలో మహిళా నాయకత్వం పెరగడం అభినందనీయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు, విశ్రాంత ఎకానమిక్స్ విభాగ ఆచార్యులు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఇక్బాల్ అలీ మాట్లాడుతూ.. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని యూనివర్సిటీ ముందుకు దుసుకొనిపోతున్నదన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి నిధులు రాబట్టాన్నారు. డీన్‌లు ఆచార్య ఎన్.రామనాథ్ కిషన్ మాట్లాడుతూ.. గెస్ట్ ఫ్యాకల్టీ నియామకంతో విద్యా విభాగం బలోపేతమైందన్నారు. స్నాతకోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ.. సమష్టి కృషితో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ విజయవంతమైందన్నారు. ఆచార్య సురేష్‌లాల్, ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య ఎస్.జ్యోతి, ఆచార్య ఎస్. నరసింహచారి మాట్లాడారు. అనంతరం సమావేశం బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది.

వార్షిక నివేదికలకు ఆమోదం

వార్షిక నివేదికలను కూడా సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోనే ఇతర విశ్వవిద్యాలయాల కంటే మెరుగ్గా ముందుకు పోతోందన్నారు. పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణలను వివరించారు. ఇటీవల మృతి చెందిన అకడమిక్ సెనెట్ సభ్యుడు పోకల చందర్ అకాల మరణానికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ దృశ్య, శ్రవణ విధానం ద్వారా మూడేళ్లలో విశ్వవిద్యాలయంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు. కేయూ పొలిటికల్ సైన్స్ విభాగపు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ గడ్డం కృష్ణయ్య నియమితులైనందుకు సమావేశం అభినందనలు తెలిపింది.

జలాశయాల వద్ద జర భద్రం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్

'పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలి'

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌తో పాటు పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. కోర్టుకు రాకుండా తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిలను వెంటనేకోర్టులో హాజరుపరచాలని చెప్పారు. జైల్లో మగ్గుతున్న ఖైదీలను సకాలంలో కోర్టులో హాజరు పరిచి, వారి కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ మంది ముద్దాయిలు ఉన్న కేసుల్లో ఒకరిద్దరు కోర్టుకు హాజరు కానీ కారణంగా మిగిలిన వారు సంవత్సరాల తరబడి కోర్టుచుట్టు తిరగడం జరుగుతుందని, వారిని పెండింగ్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. కాగా, పోలీసులు కోర్టులో చార్జీషీట్ ఫైల్ చేయువిధానం, పంచనామా, రాయు విషయంపై సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి తిరుపతి, కోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్, సూపరింటెండెంట్ అమరేందర్, పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, పోక్సోకోర్టు పీపీ కీసర పద్మాకర్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- చెరువుల వద్ద ఎవరికి పట్టని 'చావు' భయం
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- ముందు జాగ్రత్తతోనే ప్రమాదాల నివారణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి30 : వేసవి ఆరంభం కావడం, పాఠశాలలకు ఈనెల 15 నుంచి ఒక్కపూట బడులు మరూ, ఇంటర్ పరీక్షలు పూర్తికావడం, పదో తరగతి వార్షిక పరీక్షలు కూడా ముగింపు దశకు వచ్చాయి. ఈ సెలవుల్లో సరదాగా విద్యార్థులు చెరువులు, కాలువల వద్దకు ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురైన ఘటనలు గతంలో చాలా చూశాం. వాటి నుంచి పిల్లలను కాపాడుకోవటానికి తల్లిదండ్రులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులు, వైద్యులు, మానసిక ఆరోగ్యనిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు చెరువులు, కుంటలు, కాలువలు, బావుల్లో ఈత కొట్టేందుకు వెళ్తారు. దీనికనుగుణంగా జిల్లాలోని పోలీస్‌యంత్రాంగం అప్రమత్తమై వాటివద్ద అన్ని చెరువులు, కుంటల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలి. వేసవి సెలవులనగానే ఇళ్లకు చేరే పిల్లల విషయంలో ఆనందపడాలో..! లేక తమకు తెలియకుండా ఎక్కడ చెరువుల వద్దకు వెళ్లి ప్రాణాలమీదకు తెచ్చుకుంటారోనని పలు కుటుంబాల్లో ఆందోళన మొదలవుతోంది. ఎప్పుడు ఎవరూ ఎక్కడ మునిగిపోతారో? ఎవరి పిల్లల గల్లంతు వార్త వినాల్సివస్తుందో! అని భయాందోళనకు గురవుతున్నారు. కన్నతల్లులకు కడుపుకోత, తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. ఈనెల 25 హోలీ పర్వదినాన నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామం చెరువులో ఈతకు వెళ్లి చెందిన అబ్బూరి రిత్విక్‌రెడ్డి (10) అనే బాలుడు మృత్యువాత పడ్డాడు. అదేరోజు వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం పలివేల్పుల, గుండ్లసింగారం సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో స్నానాలకు వెళ్లి ముగ్గురు మునిగి చనిపోవడంతో ఆ కుటుంబాల్లో విషాదం నింపింది.


మానుకోట శివారు జమాండ్లపల్లి మున్నేరువాగులో ఈత కొడుతున్న యువకులు

గ్రామీణ ప్రాంతాల్లో..

గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంతో తల్లిదండ్రులు ప్రతీ రోజు సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధి, వ్యవసాయ, ఇతరత్రా పనులకు వెళ్లక తప్పని పరిస్థితి. ఆ క్రమంలోనే వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండే పిల్లలకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు లేక వేసవి ఎండల తాపం కావచ్చు, ఈత నేర్చుకోవాలనే సరదా కావచ్చు పిల్లలను కుంటలు, చెరువులు, బావుల వైపు నడిపిస్తున్నాయి. అందులో లోతు తెలవక తోటిపిల్లలతో ఆడు తూ పాడుతూ వెళ్లి మృత్యువాత పడుతున్నారు. దీంతో ఈత సరదా వారికి శాపంగా మారుతోంది. ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలకు ఎదుగుతారనుకున్న పిల్లలు కళ్లముందే శవాలుగా మారుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను కడసారి చూసుకుందామనుకుంటేజాడ దొరకని పరిస్థితులు ఎన్నో ఉన్నాయి. ఈత నేర్చుకోవడానికి చెరువుల్లోకి వెళ్లి కొద్ది దూరం వెళ్లాక గుంతల్లో మునిగిపోవడం, ఎవరైనా రక్షించేలోపే చనిపోవడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఎండలు పెరుగుతున్నందున ఉపశమనం కోసం ఈతకు వెళ్లే పిల్లల పట్ల జాగ్రత్తగ ఉండాలి. చెరువులు, కుంటలు, కాలువల వైపు పిల్లలను, విద్యార్థులు, యువకులను పోనివ్వకుండా తల్లిదండ్రులు, అధికారులు, పాఠశాలల యాజమాన్యాలు సమన్వంతో పిల్లల కదలికలపై నిఘా పెంచి మరిన్ని ప్రాణాలు పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


రామన్నగూడెం చెరువులో ఈనెల 25న ఈతకు వెళ్లి మృతి చెందిన రిత్విక్‌రెడ్డి (ఫైల్)

జాగ్రత్తలు తీసుకోవాలి ఇలా..

- సుశిక్షితుడైన ఈతగాడి ఆధ్వర్యంలోనే ఈత నేర్చుకోవాలి.
- వీలైనంత వరకు స్విమ్మింగ్‌పూల్‌లోనే నేర్చుకోవాలి.
- పిల్లల వెంట తప్పకుండా పెద్దలు వెళ్లాలి.
- ఈతరానివారిని చెరువులు, కుంటల వద్దకు పోనియద్దు.
- కాలువలు, వాగుల్లోకి పిల్లలు వెళ్లకుండా చూడాలి.
- కొత్త ప్రదేశాల్లో కర్రసహాయంతో లోతును చూడాలి.
- పాఠశాలలు, కళాశాలల నుంచి పిల్లలు రావడం ఆలస్యమైతే నిర్లక్ష్యం చేయవద్దు.
- విహార, తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు ఈత వచ్చినా నీటిలోకి వెళ్లొద్దు.
- ఎట్టి పరిస్థితుల్లో బావుల్లో ఈత నేర్చుకునే ప్రయత్నం చేయవద్దు.
- కాలువల్లో ఈతకు వెళ్లవద్దు.

నీటిలో మునిగేవారిని రక్షించే పద్ధతులు..

- ఈత వచ్చి ప్రత్యక్షంగా రక్షించే వారు మునిగే వ్యక్తి వెనుక నుంచి మాత్రమే వెళ్లాలి.
- మునిగే వ్యక్తి మొలతాడు, అండర్‌వేర్, జుట్టులలో ఏదేని ఒకదానిని పట్టుకుని తీసుకురావాలి.
- ఈతరాని వారు కూడా మునుగుతున్నవారిని రక్షించవచ్చు. ఒడ్డుకు దగ్గరగా ఉంటే కర్ర, టవల్, ప్యాంట్‌లను అందించి లాగాలి.
- ఒడ్డుకు కొంత దూరంలో ఉన్నప్పుడు తాడు అందించైనా లాగాలి.
- బుర్రకాయ, థర్మోకోల్, మూత బిగించిన నీటి క్యాన్ (నీటిపై తేలేవి) బాధితుడి చెంతకు చేర్చాలి.

ప్రథమ చికిత్స..

- బాధితుడిని ఒడ్డుకు చేర్చిన తర్వాత వెల్లకిలా పడుకోబెట్టాలి.
- అవసరమైతే నోటిలో నోరుపెట్టి ఊదుతూ కృత్రిమ శ్వాస అందించాలి.
- ఛాతిపై చేతులతో వత్తాలి. దీనివల్ల శ్వాస పెరుగుతుంది.
- తర్వాత దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

విద్యార్థులు..

- సరదాగా స్నేహితుల బలవంతం మీద నీళ్లలోకి దిగి మీ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు
- మీ ప్రాణాలు మీకు అన్నింటి కన్నా ముఖ్యం. లేకుంటే మీపై పంచప్రాణాలు పెట్టుకున్న తల్లిదండ్రులకు భవిష్యత్తులో మరెవరు తోడ్పాటును అందించలేరు.

ముందస్తు జాగ్రత్తలతో వేసవిని అధిగమిద్దాం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు జాగ్రత్తలతో మండువేసవిని అధిగమిద్దామని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం వేసవి వడగాల్పులు, వడదెబ్బ, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రజలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని జనం వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అందులో భాగంగా మునిసిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అన్ని మునిసిపాలిటీల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకుని వడగాల్పులపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అలాగే తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో విద్యుత్ అవసరం అధికంగా ఉంటుందని, అందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి..

గ్రామీణ ఉపాధిహామీ పనుల వద్ద షెడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని గ్రామీణాభివృద్ధి అధికారులను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలు, గర్భిణుల సౌలభ్యం కోసం ముందస్తుగా ఓఆర్ఎస్, సంబంధిత ద్రావకాలను సిద్ధంగా ఉంచాలన్నారు. అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయానికి కొరత లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిపాఠశాలల్లో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలన్నారు. అటవీ పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా అక్కడక్కడా నీటితొట్టిలు ఏర్పాటు చేసి నీరునిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని అటవీ అధికారులను ఆదేశించారు. ఎండతీవ్రత దృష్ట్యా ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వడదెబ్బ, అతిసారలాంటి సమస్యలపై వైద్య, ఆరోగ్య సిబ్బంది, అధికారులు వెంటనే స్పందిస్తూ తక్షణ సేవలందించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లా అధికారులు రమాదేవి, సుబ్బారావు, మరియన్న, హరిప్రసాద్, శాంతకుమారి, అభిమన్యుడు, నరేష్, తానేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజలు ఎండల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, మార్చి 30 : ప్రజలు రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎం అండ్‌హెచ్‌వో కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరాకాలనీ, అర్బన్ హెల్త్‌సెంటర్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలు ముఖ్యంగా తలనొప్పి, నాడీ వేగంగా కొట్టుకోవడం, శరీరంలో నీటిని కోల్పోవడం, అపస్మారక స్థితికి వెళ్లడం లాంటివి ఉంటాయని చెప్పారు. ప్రజలు వీటిపట్ల అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే వారు ఉదయం 6 నుంచి 11 గంటల లోపే ఇంటికి చేరుకోవాలన్నారు. ఎండలో రుమాల్, టోపి, గొడుగు ఉపయోగించుకోవాలన్నారు. వీటిపట్ల ఆయా హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది ప్రజలకు ఎప్పటికిప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, శ్రావణ్, కెవి. రాజు పాల్గొన్నారు.

గాయపడిన ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : మానుకోట జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ.. మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. టౌన్‌ఎస్సై శివ తెలిపిన వివరాల ప్రకారం.

మహబూబాబాద్ కేంద్రానికి చెందిన దూదికట్ల మహేష్‌కుమార్ (50) నెల్లికుదురు మండలం మునిగవీడు జడ్పీహైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఉపాధ్యాయుల సంబంధించిన వేతనాల ఫైల్‌ను తీసుకువెళ్తున్న క్రమంలో బంధన్ బ్యాంక్ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో మహేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, బంధువులు చికిత్స నిమత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడు భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతి


మృతి చెందిన యాద ధనలక్ష్మి

గూడూరు, మార్చి 30 : మండలంలోని మచ్చర్ల జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మచ్చర్ల గ్రామానికి చెందిన యాద ధనలక్ష్మి (67) తన మనువరాలును మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లింది. అక్కడ పనుల ముగించుకుని తిరిగి మహబూబాబాద్‌లో బస్సు ఎక్కి మచ్చర్ల స్టేజీ వద్ద దిగి మనవరాలితో కలిసి రోడ్డు దాటుతున్న క్రమంలో మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న కారు యాద ధనలక్ష్మిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 ద్వార మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలు ధనలక్ష్మికి భర్త శ్రీహరి, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

హుస్సేన్‌నాయక్‌కు సన్మానం

గూడూరు, మార్చి 30 : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుగా ఎంపికైన తార్యతండాకు చెందిన జాటోతు హుస్సేన్‌నాయక్‌ను జడ్పీకోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాసీం శనివారం శాలువాతో సత్కరించారు. తార్యతండాలో హుస్సేన్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మూడు మోహన్, అమరేందర్‌రెడ్డి, చీకటి కిరణ్, బాషిపాక నవీన్‌కుమార్, వెంకన్న, శంకర్, సీతారాం, దేవేంద్రాచారి, రహీంపాషా, కటార్ సింగ్, భూక్య సురేష్, బోడ ఎల్లయ్య, హైమద్‌పాష పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి

- మోటివేషన్ స్పీకర్ రహీమ్

గూడూరు, మార్చి30 : విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని అప్పుడే ఉన్నత స్థానాల్లో నిలుస్తారని మోటివేషన్ స్పీకర్ ఎండీ రహీమ్ అన్నారు. పొనుగోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీలో భాగంగా కెరియర్ గైడెన్స్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలువస్తాయని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో పొనుగోడు పాఠశాల పీఎంశ్రీకి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పాఠశాలను విద్యావేత్త కోరె వెంకన్న అభివృద్ధి చేశారని, ఆయన పేరును విద్యార్థులు బాగా చదివి కాపాడాలని సూచించారు. హెచ్ఎం రజిత, ఉపాధ్యాయులు మంగీలాల్, చైతన్య, రాములు, రవికుమార్, స్ఫూర్తి వాహిని, రామకృష్ణ, నగేష్, అనిల్, రమ్య, హుస్సేన్, మోహినోద్దీన్, స్వాతి, శోభ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కేసముద్రం, మార్చి 30 : మండలంలోని ధన్నసరి మాజీ సర్పంచ్ బందారపు సూరయ్య ఇటీవలె రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని శనివారం ఎంపీ మాలోత్ కవిత పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమెవెంట సొసైటీ చైర్మన్లు మర్రి రంగారావు, దీకొండ వెంకన్న, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, నుంచు సూరయ్య, ధరావత్ భీమ, బానోత్ శంకర్ ఉన్నారు.

బిచ్యా కుటుంబానికి మాజీమంత్రి..

బయ్యారం, మార్చి 30 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బానోత్ బిచ్యా కుటుంబసభ్యులను శనివారం మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బిందుతో కలిసి పరామర్శించారు. బయ్యారం మండలం బాలాజీపేట గ్రామపంచాయతీ, తీత్రీతండాకు చెందిన డాక్టర్ బానోత్ వీరన్న తండ్రీ బానోత్ బిచ్యా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం తీత్రీతండా నందు బిచ్యాచిత్రపటానికి సత్యవతిరాథోడ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందులు పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌నాయక్, మంత్రియానాయక్, జగన్, చిరంజీవి పాల్గొన్నారు. అంతకు ముందు గంధంపల్లిలో వెనిగళ్ల జగ్గయ్య ప్రజాకల్యాణ మండపంలో జరిగిన భూక్య కిషోర్ లాలు, లావణ్య దంపతుల పుత్రిక హర్షద తక్సీ మొదటి పుట్టిరోజు వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు చిన్నారిని ఆశీర్వదించారు.

వ్యక్తిపై నలుగురు యువకుల దాడి

- ఈనెల 22న ఘటన, 23న నలుగురిపై కేసు నమోదు

కొత్తగూడ, మార్చి 30 : కొత్తగూడ మండలానికి చెందిన వ్యక్తిపై నలుగురు యువకులు దాడి చేశారు. పది రోజుల క్రితమే దాడి, నలుగురు యువకులపై కేసు నమోదైంది. సోషల్ వీడియో వైరల్ కావడంతో వారం రోజుల తర్వాత చర్చనీయంశంగా మారింది. వివరాల ప్రకారం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దళిత యువకుడు పొగుళ్లపల్లి గ్రామంలోని ఓ టెంట్‌హౌస్, డీజే యజమాని వద్ద పని చేస్తున్నాడు. ఈనెల 19న మ్యూజిక్ సిస్టం పోవడంతో డీజే యజమాని 20న పోలీస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తన వద్ద పనిచేస్తున్న యువకుడే మ్యూజిక్ సిస్టం దొంగిలించాడని అనుమానంతో 22న యువకుడిని పొగుళ్లపల్లి తీసుకువచ్చి డీజే యజమాని, తన వద్ద పని చేస్తున్న ముగ్గురు యవకులు కలిసి విచక్షణ రహితంగా తీవ్రంగా దాడిచేసి, కొట్టారు. గాయాలపాలయిన ఆ యువకుడు 23న దాడి చేసిన నలుగురిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దళిత యువకుడిపై దాడి చేసిన ఘటనలో యువకుడి ఫిర్యాదు మేరకు పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన గద్ద అశోక్, కమ్మ హరీష్, చెవ్వ శివ, వట్టం నాగరాజుపై 23న కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ పేర్కొన్నారు.

అమ్మపాలెంలో వేంకటేశ్వరస్వామికి హోమం

డోర్నకల్, మార్చి 30 : మండలంలోని అమ్మపాలెంలో శ్రీదేవి, భూదేవి, గోదాదేవి సమేత శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్చకులు హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వీక్షించారు.

సీతారామచంద్రస్వామి దేవాలయ వార్షికోత్సవం

- హాజరైన కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్

కేసముద్రం, మార్చి 30 : కేసముద్రం మండలం ఉప్పరపల్లి శివరామగిరి క్షేత్రంలో శనివారం సీతారామచంద్రస్వామి, రామలింగేశ్వరస్వామి దేవాలయాలు, బొడ్రాయి మూడో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బొడ్రాయి వద్ద అభిషేకాలు జరిపారు. కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్ హాజరై ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఆయనవెంట టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, జిల్లా నాయకుడు బండారు దయాకర్, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్, గ్రామపార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, తండ రాములు, కోమాకుల రమేష్, రాయబారపు భూమయ్య, అరిగె విజేందర్, చాగంటి రాములు, బైరు రాజ్‌కుమార్ ఉన్నారు.

ఉగాది వేడుకలకు సత్యనారాయణ



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 30 : పట్టణ కేంద్రానికి చెందిన కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ మద్రాస్ తెలుగు విశ్వవిద్యాలయం ఉగాది వేడుకల్లో పాల్గొనేందుకు శనివారం ఆహ్వానం అందింది. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏప్రిల్ 5న యూనివర్సిటీ రజతోత్సవ ప్రాంగణంలో నిర్వహించనున్న క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకల్లో దేశ నలుమూలల నుంచి 60 మంది తెలుగు కవులు పాల్గొననుండగా, అందులో సత్యనారాయణకు అవకాశం దక్కింది. గత రెండున్నర దశాబ్దకాలంగా రాష్ట్ర, జాతీయ కవి సమ్మేళనాల్లో పాల్గొని పురస్కారాలు పొందిన సత్యనారాయణకు ఈ అవకాశం రావడం పట్ల కవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్యనారాయణ కవి, రచయితగా రాణిస్తూ తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడుగా, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా పదవులు నిర్వహిస్తున్నారు.

పెద్దవంగరలో వాహనాల తనిఖీ

పెద్దవంగర, మార్చి 30 : మండల కేంద్రంలోని తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై ఏఎస్సై విజయ్‌రాజు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, లైసెన్స్‌లేని, పరిమితి మించి అధిక లోడ్‌తో వెళ్తున్న పలువురి వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ సరుకులను తరలించే వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపేతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి'

తొర్రూరు, మార్చి 30 : రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జాతీయ మాలమహానాడు జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమళ్ల మహేష్ అన్నారు. శనివారం తొర్రూరులో రాజ్యాంగ రక్షణ యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగ హక్కులకు కేంద్రప్రభుత్వంలో రక్షణ లేదని, బీజేపీ పాలనలో దళిత, గిరిజనులకు భద్రతలేదని, రాజ్యాంగంలోని హక్కులను రక్షించుకునేందుకు ఏప్రిల్ 4వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా రక్షణ యాత్ర జరుగుతుందని, తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగే యాత్రకు తొర్రూరు బహుజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్, రాకేష్, నవీన్, శ్రీనివాస్, అంజయ్య, ధర్మయ్య, రవి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- డోర్నకల్‌మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్, మార్చి 30 : అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ఉన్నవారే నిజమైన కార్యకర్తలని, వారికి ఎల్లప్పుడు తాను అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జైన్‌భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ బాలునాయక్, పార్టీ నాయకులు సురేష్‌కుమార్‌పాట్నీ, పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, ఉయ్యాలవాడ ఎంపీటీసీ నున్న మల్లికార్జున్, కత్తెరసాల విద్యాసాగర్, కల్లెపు సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

తొర్రూరులో ఐదేళ్ల క్రితం సీసీ కెమెరాల ఏర్పాటు


తొర్రూరులో పనిచేయని సీసీ కెమెరాలు

తొర్రూరు, మార్చి 30 : ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమా నం. అంతటి పనితనం కలిగిన సీసీ కెమెరాల నిర్వహణపై పోలీసులు శ్రద్ధ చూపకపోవడం, అధికారులకు పట్టింపులేని తనంతో నిఘా నేత్రాలు నిద్రావస్థలోకి వెళ్లి పనిచేయని పరిస్థితి ఏర్పడింది. తొర్రూరులోని 16 వార్డుల పరిధిలో ఐదేళ్ల క్రితం పోలీసులు సుమారు 128 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశారు. కానీ, అవి పనిచేయక నిద్రావస్థకు చేరుకున్నాయి. పోలీసు స్టేషన్ పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. ఇండ్ల, షాప్‌ల ముందుపార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు చోరీ అయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పట్టుకోవడంలో పోలీసులకు సవాల్‌గా మారింది.

నిర్వహణను పట్టించుకునే వారేరి?

పట్టణంలో సీసీ కెమెరాలు ఐదేళ్ల క్రితం వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల సహకారంతో ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లో, బస్టాండ్ ఏరియాలో, అన్నారం రోడ్డు, మార్కెట్, అంబేద్కర్ విగ్రహం వద్ద, మన గ్రోమోర్, పాల కేంద్రంతో పాటు మెయిన్ రోడ్డు, వివిధ వార్డుల్లో కూడళ్ల వద్ద 128 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ, వాటిలో ప్రస్తుతం 30 నుంచి 35 కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. గతంలో ఏర్పాటు చేసినప్పుడు నేరాల సంఖ్య తగ్గింది. పోలీసులు ప్రశాంతంగా ఉన్నారు. కానీ, కెమెరాల నిర్వహణ లేకపోవడంతో వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఖర్చు భయంతో అవసరం లేని చోట్ల పోలీసులు కెమెరాల వైపుకూడా చూడటం లేదు. కొన్నిచోట్ల వైర్లు తెగిపోయి, వ్యాలిడిటీ ముగియడంతో పనిచేయక మూలనపడ్డాయి. వేసవి కాలం రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వివిధ కాలనీల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీలు పెరుగుతాయని, పోలీసులు దృష్టి పెట్టి సీసీ కెమెరాలు పనిచేసేలా పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన కూడళ్లలో పనిచేస్తున్నాయి..

- జగదీష్, ఎస్సై, తొర్రూరు

పట్టణంలోని వివిధ కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ప్రధానంగా మెయిన్ రోడ్డులోని 4, 5 సెంటర్‌లు, పోలీసు స్టేషన్ పరిసరాల్లో సుమారు 30 మేర సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. తొర్రూరులోని వార్డుల్లో కెమెరాలు పనిచేయడం లేదు. కెమెరాల నిర్వహణకు సొంతంగా, దాతల సహకారంతో రిపేర్‌లు చేయిస్తున్నాం. దాతలు ముందుకు వచ్చినేరాల నియంత్రణకు సహకరిస్తే మిగతా కెమెరాలను కూడా రిపేర్ చేయించి, అందుబాటులోకి తీసుకొస్తాం.

రేపటి నుంచి గ్రూప్స్ ఉద్యోగ నియామకాలకు ఉచిత శిక్షణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి30 : మానుకోట పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి గ్రూప్స్ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతీయువకులు తమ ఒరిజినల్ డిగ్రీ, కుల, ఆదాయం, ఆధార్, సంబంధిత సర్టిఫికెట్లపై అధికారులచే వేరిఫికేషన్ చేయించుకుని రెండు పాస్‌ఫోటోలతో, ఒక సెట్‌జిరాక్స్ ప్రతులను సమర్పించాలన్నారు. అర్హులైన నిరుద్యోగ యువతీయువకులకు హాస్టల్, భోజన వసతి కల్పించబడునని తెలిపారు. ఈ సదావకాశాన్ని జిల్లా నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫర్నిచర్ షాపులో చోరీ

- రూ.లక్ష విలువచేసే సామగ్రి అపహరణ

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : జిల్లా కేంద్రంలోని బంధం చెరువు సమీపంలో ఉన్న ఫర్నిచర్ షాపులో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రూ.లక్ష విలువగల ఫర్నిచర్‌ను అపహరించుకుపోయినట్లు షాపు యాజమాని మహ్మద్ షకీల్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. షాపు వెనుకభాగంలో ఉన్న తలుపులు పగులగొట్టిన గుర్తుతెలియని దుండగులు షాపులో ఉన్నచిన్న కూలర్లు 10, సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్, మోటార్‌పంప్‌లను అపహరించుకుపోయినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు షకీల్ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని ఆందోళన


జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీగార్డు, పేషెంట్ కేర్ సిబ్బంది

నెహ్రూసెంటర్, మార్చి 30 : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న పేషెంట్‌కేర్, సెక్యూరిటీగార్డు, శానిటేషన్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శనివారం సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆర్ఎంవో జగదీష్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ తమకు చెల్లించాల్సిన వేతనంలో సాయిగ్రూప్ ఏజెన్సీ కోత విధిస్తుందని, తమకు ప్రభుత్వం నుంచి వచ్చే వేతనం పూర్తిస్థాయిలో అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో తమ దగ్గర వసూలు చేసి తక్కువ డబ్బులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. సాయిగ్రూప్‌లోపనిచేస్తున్న ఓ ఉద్యోగి తమపై పెత్తనం చేస్తూ మహిళ సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బంది శంకర్, దేవేందర్, దేవయ్య, మురళీకృష్ణ, శ్రావణ్, మహేష్, సుజాత, గౌతమి, అరుణకుమారి, వసంత, ఇందిర, అమృత, అనిత పాల్గొన్నారు.

'భీమానాయక్‌కు ఎల్‌హెచ్‌పీఎస్‌కు సంబంధం లేదు'

నెహ్రూసెంటర్, మార్చి 30 : లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర కోకన్వీనర్‌గా పని చేస్తున్న గుగులోతు భీమానాయక్‌కు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్, రాష్ట్ర అధ్యక్షుడు భూక్య కోట్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్ పేరుతో భీమానాయక్ రాష్ట్ర, జాతీయ కమిటీలకు సంబంధం లేకుండా మహబూబాబాద్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీతో మిలాఖత్ అయి సంఘానికి సంబంధం లేకుండా భారీ బహిరంగ సభకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. భీమానాయక్ గతంలో తన స్వలాభం కోసం సంఘ కార్యకలాపాలను ధిక్కరించి, బీఆర్ఎస్ కోసం ప్రచారం చేశారని చెప్పారు. సంఘానికి సంబంధం లేకుండా సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున ఆయన్ను సంఘం నుంచి తొలగిస్తున్నామని వారు వివరించారు.